బలపడనున్న అల్పపీడనం



● కోస్తాతీర జిల్లాలకు వర్ష సూచన

అడయార్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడివున్న అల్పపీడనం మరింతగా బలపడనుంది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని కోస్తాతీర ప్రాంతాలతో పాటు కొన్ని దక్షిణాది జిల్లాలు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో వర్షాలు కురవచ్చని వాతావరణ శాఖ హెచ్చరించింది. రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు తీవ్రంగా బలపడిన విషయం తెల్సిందే. ఈ రుతుపవనాల కారణంగా రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వీటికితోడు బంగాళాఖాతంలో అల్పపీడనాలు, తుఫానుల ప్రభావంతో రాష్ట్రంలో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇటీవల ఫెంగల్ తుపాన్ అనేక జిల్లాల్లో బీభత్సం సృష్టించింది. దాని నష్టం నుంచే ప్రజలు ఇపుడిపుడే కోలుకుంటున్నారు. ఈ క్రమంలో తాజాగా బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడగా, ఇది మరింతగా బలపడి వెస్ట్ - నార్త్ వెస్ట్ దిశగా ప్రయాణించవచ్చని వాతావారణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ కారణంగా సోమవారం రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలతో పాటు పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురవొచ్చని అంచనా వేసింది. ప్రధానంగా రామనాథపురం, పుదుక్కోట, తంజావూరు, తిరువారూరు, నాగపట్టణం, మైలాడుదురై జిల్లాల్లో కొన్ని చోట్ల, కారైక్కాల్ ప్రాంతంలో భారీ వర్షం కురవొచ్చని తెలిపింది. 17వ తేదీ రాష్ట్రంలోని అనేక ప్రాంతాలతో పాటు పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అదేవిధంగా తంజావూరు, అరియలూరు, పెరంబలూరు, పుదుక్కోట, తిరుచ్చి, కళ్ళకుర్చి, విల్లుపురం, చెంగల్పట్టు జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లోనూ, పుదుచ్చేరిలో భారీ వర్షం కురవొచ్చని వాతావరణ శాఖ పేర్కొంది.

కావేరి డెల్టాలో నీటమునిగిన పంటలు

● అన్నదాతల కన్నీరు



తంజావూరు వద్ద నీట మునిగిన పంటలను చూపుతున్న రైతులు

ప్యారీస్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో బలపడుతున్న అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా కొన్ని జిల్లాలు, డెల్టాలో మూడు రోజులుగా కురిసిన భారీవర్షాలకు సుమారు 2.5 లక్షల ఎకరాల్లో వరి, చెరకు, అరటి, ఆరుతడి పంటలు మునిగిపోవడంతో రైతన్నలు కన్నీరుమున్నీరవుతున్నారు. రుణాలు తీసుకుని వేసిన పంటలు కోల్పోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తిచేశారు. సహజంగా కావేరి డెల్టా జిల్లాల్లో ప్రధానంగా వరి పండిస్తున్న నేపథ్యంలో, మినుములు, పెసలు, మొక్కజొన్న, కూరగాయలు, ఆకుకూరలను కొన్ని ప్రాంతాల రైతులు పండిస్తున్నారు. జనవరిలో కోతకు వస్తునన వరి వర్షార్పణం కాగా, తంజావూరు జిల్లాలోనే 200 ఎకరాల వేరుశెనగ, 300 ఎకరాలకు పైగా అరటి తోటల్లో వరద నీరు చేరింది. మైలాడుదురై జిల్లాలో 30 ఎకరాలకు పైగా వరి నీటమునిగింది. నాగపట్టణం జిల్లాలో 15వేల ఎకరాలు, తిరువారూరులో 10 వేలు, తిరుచ్చి జిల్లాలో 10 వేల ఎకరాల్లో సంబా వరి నీటిపాలైంది. కాగా, వర్షాల కారణంగా కడలూరు జిల్లాలోని వీరాణం చెరువు పూర్తిస్థాయిలో నిండడంతో మిగులు జలాలు విడుదల చేశారు. శ్రీ ముష్ణం, కాట్టుమన్నార్‌కోయిల్ తదితర ప్రాంతాల్లో సుమారు 75 వేల ఎకరాల వరి నీటమునిగింది. డెల్టాలో సుమారు 2.5 లక్షల ఎకరాల పంటలు కోల్పోయిన రైతులు తమకు నష్టపరిహారం ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.

అమరజీవి త్యాగం స్ఫూర్తిదాయకం

ఐఏఎస్ అధికారి జె.మేఘనాథ రెడ్డి



అమరజీవి స్మారక భవన నిర్వాహక కమిటీ సభ్యులతో కలసి నివాళులర్పిస్తున్న మేఘనాథరెడ్డి

ప్యారీస్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టిశ్రీ రాములు త్యాగం అందరికి స్ఫూర్తిదాయకమని తమిళనాడు స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ మెంబర్ సెక్రటరీ జె.మేఘనాథ రెడ్డి పేర్కొన్నారు. మైలాపూర్‌లోని అమరజీవి పొట్టి శ్రీరాములు భవన నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతిని ఆత్మార్పణ దినంగా ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. వసుంధరా దేవి ప్రార్థనాగీతంతో ప్రారంభమైన ఈ వేడుకలకు భవన నిర్వాహక కమిటీ ఛైర్మెన్ కాకుటూరు అనీల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షత వహించారు. అతిథులు, కమిటీ నిర్వాహకులతో కలసి ఆయన అమరజీవి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యఅతిథి మేఘనాథరెడ్డి మాట్లాడుతూ... దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా పొట్టి శ్రీరాములు ఆశయం నెరవేరలేదని, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనకు ఆయన దృఢసంకల్పంతో ఆమరణ దీక్ష చేసి అశువులు బాసారని, ఆయన ప్రాణత్యాగాన్ని మనము స్ఫూర్తిగా తీసుకోవడంతో పాటు మన సంస్కృతి, భాషను కాపాడుకోవడం ద్వారా ఈ మహనీయునికి అర్పించే ఘన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా ప్రపంచ తెలుగు సమాఖ్య సెక్రటరీ జనరల్ కె.శ్రీలక్ష్మి మోహనరావు, భవన నిర్వాహక కమిటీ కార్యదర్శి కోశాధికారి వి.కృష్ణారావు, సంయుక్త కార్యదర్శి ఊరా శశికళ అంజనేయులు, సభ్యులు డా.ఏవీ శివకుమారి, జేఎం నాయుడు, గుడిమెట్ల చెన్నయ్య సహా పురప్రముఖులు ఆనంద్‌కుమార్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, పీవీఆర్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. అమరజీవి ఆత్మార్పణ దినం సందర్భంగా అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షులు, ప్రొఫెసర్ సీఎంకే రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆర్.నందగోపాల్, ఉపాధ్యక్షులు గొల్లపల్లి ఇశ్రాయేలు, వీజీ జయకుమార్, ఆర్.శంకరన్, సభ్యులు సీహెచ్ తిరుమలరావు, పాల్ కొండయ్య తదిరులు అమరజీవి విగ్రహానికి నివాళులర్పించారు. ద్రావిడ తెలుగు దేశం పార్టీ ఆర్గనైజర్ ముని ఆర్ముగం, వీరపాండ్య కట్టబ్రహ్మన వంశావళికి చెందిన ఇలయ కట్టబొమ్మన్ నివాళులర్పించారు. అలాగే, తమిళనాడు తెలుగు పీపుల్స్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు దేవరకొండ రాజు, పొట్టి శ్రీరాములు న్యాయవాది కిల్లంపల్లి వల్లభేశ్వరరావు కుమారుడు డా.కిల్లంపల్లి శ్రీనివాసరావు, సూర్యకుమారి తదితరులు కూడా అమరజీవికి ఘననివాళులర్పించారు.



హాజరైన తెలుగు వారు





సర్వసభ్యమండలిలో ప్రసంగిస్తున్న ఎడప్పాడి పళనిస్వామి - సమావేశానికి హాజరైన సభ్యులు

దొడ్డిదారిన అధికారంలోకి వచ్చిన డీఎంకే!

● సర్వసభ్య మండలిలో ఈపీఎస్ ధ్వజం

చెన్నై, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అమలు చేయడానికి వీలుకాని ఎన్నో హామీలలతో ప్రజలను మోసగించి దొడ్డిదారిన డీఎంకే అధికారంలోకి వచ్చిందని, గత మూడేళ్లుగా ప్రజావ్యతిరేక పాలనే కొనసాగిస్తోందని, రాబోవు శాసనసభ ఎన్నికల్లో తగిన గుణ పాఠం చెప్పడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ధ్వజమెత్తారు. వానగరంలోని శ్రీవారు కల్యాణమండపంలో ఆదివారం జరిగిన పార్టీ సర్వసభ్య మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమి అన్నాడీఎంకే కంటే స్వల్ప ఆధిక్యతతోనే గెలిచిందని, ఈసారి శాసనసభ ఎన్నికల్లో ఘోరపరాజయం తప్పదన్నారు. అన్నాడీఎంకేకి పార్టీ శ్రేణులే బలమని, సభ్యత్వ గుర్తింపు కార్డులను సభ్యుల ఇళ్ళవద్దకే వెళ్ళి పంపిణీ చేసిన పార్టీ తమదేనని చెప్పారు. డీఎంకే అధికారంలోకి వచ్చి మూడేళ్ళవుతున్నా ప్రజా సంక్షేమ పథకాలేవీ అమలు చేయాలేదని, ఎన్నికల సందర్భంగా వందల సంఖ్యలో అమలుకు వీలుకాని హామీలు ప్రకటించి అధికారంలోకి వచ్చాక ఒకటి రెండు హామీలను మాత్రమే నెరవేర్చి తక్కినవి గాలికి వదిలేసిందని ఈపీఎస్ విమర్శించారు. అన్నాడీఎంకే హాయంలో తుపానులు, వరద పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొన్నామని, బాధితులను ఆదుకున్నామని చెప్పారు. కావేరి వివాదానికి శాశ్వత పరిష్కారం అందించింది అన్నాడీఎంకే ప్రభుత్వమేనని, రైతులకు పంటల బీమా పథకాన్ని, అత్తికడవు - అవినాశి పథకాన్ని అమలు చేసిందీ, కరోనా సమయంలో అమ్మా క్యాంటీన్ల ద్వారా ప్రజలకు మూడుపూటలా ఆహారం ఉచితంగా అందించామని ఈపీఎస్ చెప్పారు. ప్రజా సంక్షేమపథకాలను గానీ, దీర్ఘకాలిక ప్రయోజనాలను అందించే పథకాలను గానీ అమలు చేయకుండా డీఎంకే ప్రభుత్వం ప్రజలపై మోయలేనంత రుణభారాన్ని మోపిందని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో 200 సీట్లు గెలుచుకుంటామని డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ అహంకారంతో ప్రకటించారని, ఆ ఎన్నికల్లో ఘోరపరాజయం తప్పదనే విషయాన్ని విస్మరిస్తున్నారని చెప్పారు. అన్నాడీఎంకేలో మునుపెన్నడూ లేనంత ఉత్సాహం ఉరకలు వేస్తున్నదని, ప్రజాదరణ చూస్తుంటే మళ్లీ తామే అధికారంలోకి వస్తామనే భావన తనకు కలుగుతోందని, ప్రజలంతా డీఎంకే ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సిద్ధంగా ఉన్నారని ఈపీఎస్ చెప్పారు.



వేదికపై అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు ఎంజీఆర్, మాజీ ముఖ్యమంత్రి జయలలిత చిత్రపటాలకు ఎడప్పాడి పళనిస్వామి

234 నియోజకవర్గాల్లో పర్యటన...

అసెంబ్లీ ఎన్నికల ముందస్తు ప్రచారానికి సన్నాహంగా వచ్చే యేడాది జనవరి నెలాఖరు నుండి నియోజకవర్గాల వారీగా తాను పర్యటించనున్నట్లు ఈపీఎస్ చెప్పారు. 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటన చేసి పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపబోతున్నట్లు తెలిపారు. సమావేశాల్లో మాజీ మంత్రులు పొన్నయ్యన్, కేపీ మునుసామి, సెంగోటయ్యన్, ఎస్పీ వేలుమణి, తంగమణి, డి. జయకుమార్, నత్తం విశ్వనాథన్, తంబిదురై, కేపీ అన్బళగన్, పి. వలర్మతి, గోకుల ఇందిరా, పొల్లాచ్చి జయరామన్, దళవాయి సుందరం, సెల్లూరు రాజు, రాజేంద్రబాలాజీ, పరంజోతి, మాజీ స్పీకర్ ధనపాల్, ప్రముఖ సినీనటి గౌతమి తదితరులు పాల్గొన్నారు.

6 వేల మందికి మాంసాహారం...

ఈ సమావేశాలకు విచ్చేసిన పార్టీనేతలు, ప్రముఖులు, మాజీ మంత్రులు, శాసనసభ్యులు, కార్యకర్తలు సహా 6 వేల మందికి రుచికరమైన మాంసాహారం, శాఖాహారం అందజేశారు. ఆదివారం ఉదయం అల్పాహారం వడ్డించారు.

ఈపీఎస్‌కు ఘనస్వాగతం...

ఈ సమావేశానికి విచ్చేసిన అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామికి మాజీ మంత్రి, పార్టీ తిరువళ్లూరు జిల్లా శాఖ ఇన్‌ఛార్జి బెంజమిన్ నాయకత్వంలో పార్టీ ప్రముఖులు, మాజీ మంత్రులు వేలాదిమంది కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. వానగరం శ్రీవారు వెంకటాచలపతి కల్యాణమండపం వద్దకు ఈపీఎస్ చేరుకోగానే జిల్లా నాయకులు కన్నన్, జనార్థనన్, మధురవాయల్ దేవదాస్, నెర్‌కుంద్రం సత్యనాధన్, కేఎస్ రవి చంద్రన్ తదితరులు ఆయనపై పూలు చల్లి స్వాగతం పలికారు.

కొత్త కారవాన్‌లో వచ్చిన ఈపీఎస్...

ఈ సమావేశాలకు ఈపీఎస్ కొత్త కారవాన్‌లో వచ్చారు. పార్టీ ప్రదాన కార్యదర్శిగా ఎన్నికైన తర్వాత గతేడాది జరిగిన సర్వసభ్యమబడలి సమావేశానికి ఆయన వ్యాన్‌లో వచ్చారు. ఈ నేపథ్యంలో ఆదివారం జరిగిన సర్వసభ్యమండలి సమావేశానికి ఆయన 'ఫోర్స్ ఆర్బేనియా' అనే కొత్త కేరా వ్యాన్‌లో వచ్చారు.

సర్వసభ్య మండలిలో 26 తీర్మానాలు

● మళ్లీ సీఎం పీఠంపై ఈపీఎస్‌ను కూర్చోబెడదాం

చెన్నై, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కులాలవారీగణనకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, టంగ్‌స్టన్ తవ్వకాల ప్రతిపాదన కేంద్రం ఉపసంహరించుకోవాలని, విద్యను రాష్ట్ర జాబితాలోకి చేర్చాలని కోరుతూ అన్నాడీఎంకే కార్యాచరణ మండలి, సర్వసభ్యమండలి సమావేశాల్లో తీర్మానాలు చేశారు. వానగరంలోని శ్రీవారు వేంకటాచలపతికల్యాణమండపంలో ఆదివారం ఉదయం పార్టీ ప్రిసీడియం ఛైర్మన్ తమిళ్‌మగన్ హుసేన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలోని డీఎంకే ప్రభుత్వమే కులాలవారీ గణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఓ తీర్మానం చేశారు.కార్యాచరణ మండలి సమావేశంలో 9 తీర్మానాలు, సర్వసభ్యమండలిలో 17 తీర్మానాలు చొప్పున మొత్తం 26 తీర్మానాలు ప్రతిపాదించి ఆమోదించారు. సర్వసభ్యమండలి సమావేశంలో టంగ్‌స్టన్ తవ్వకాలను ప్రతిపాదన అడ్డుకోవడంలో విఫలమైన డీఎంకే ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశాలలో చేసిన తీర్మానాల వివరాలిలా ఉన్నాయి:

- నీట్ రద్దు చేస్తామంటూ మూడేళ్ల పైగా ప్రజలను మోసపుచ్చుతూ డీఎంకే ప్రభుత్వం ఆడుతున్న కపటనాటకాలకు ఖండన.
- విద్యను మళ్ళీ రాష్ట్ర జాబితాలోకి మార్చేలా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టసవరణ చేయాలి
- ఫెంగల్ బాధితులకు కనీస వసతులు కూడా కల్పించకుండా డీఎంకే పాలకులు అనుసరించిన నిర్లక్ష్య ధోరణికి ఖండన
- రాష్ట్రంలో క్షీణించిన శాంతి భద్రతలు, పన్నుల విధింపు తదితర డీఎంకే ప్రజావ్యతిరేక విధానాలకు ఖండన.
- ఎన్నికల హామీలను నెరవేర్చని డీఎంకే ప్రభుత్వానికి నిరసన
- తిరుక్కురళ్‌ను జాతీయ గ్రంథంగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం
- కేంద్ర ప్రభుత్వం రూపొందించే చట్టాలకు హిందీలో పేర్లు పెట్టకుండా ఆంగ్లంలోనే పెట్టాలని డిమాండ్ చేస్తూ తీర్మానం.
- ఫార్ములా కార్ రేస్, కలం స్మారక చిహ్నం అంటూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న డీఎంకే ప్రభుత్వానికి తీవ్ర ఖండన
- నీటివనరుల పూడికతీత పనులు చేపట్టకుండా డీఎంకే ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేకధోరణికి నిరసన
- గోదావరి-కావేరి, పరప్పికుళం-అళియారు, పాండియారు-పున్నపుళ అనుసంధాన పథకాలను అమలు చేయని డీఎంకే ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసన.
- ఓటర్ల జాబితా తయారీలో జరుగుతున్న తప్పులు సవరించి న్యాయబద్ధంగా ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు చేపట్టాలని కోరుతూ తీర్మానం.
- ముస్లిం ఖైదీలను విడుదల చేయడానికి ఎలాంటి చర్యలు చేపట్టని డీఎంకే ప్రభుత్వాన్ని ఖండిస్తూ తీర్మానం
- రాష్ట్రానికి న్యాయబద్ధంగా విడుదల చేయాల్సిన నిధులను సక్రమంగా విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం
- 2026ఎన్నికల్లో విజయం సాధించి ఎడప్పాడి పళనిస్వామిని మళ్ళీ సీఎం పీఠంపై కూర్చోబెడతామంటూ తీర్మానం

ఈ సమావేశంలో సర్వసభ్యమండలి, కార్యాచరణ మండలి సభ్యులు 2523 మంది, ప్రత్యేక ఆహ్వానితులు 1000 మంది పాల్గొన్నారు. ఆహ్వానాలు ఉన్న వారిని మాత్రమే సమావేశానికి అనుమతించారు.



ఇళంగోవన్ కుటుంబీకులను పరామర్శిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

ప్రభుత్వ లాంఛనాలతో ఇళంగోవన్ అంత్యక్రియలు

చెన్నై, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఈరోడ్ ఈస్ట్ శాసనసభ్యుడు ఈవీకేఎస్ ఇళంగోవన్ అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో ముగిలివాక్కం శ్మశానవాటికలో ఆదివారం సాయంత్రం జరిగాయి. తీవ్ర అనారోగ్యతో నెల రోజులకు పైగా ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఆయన కన్నుమూశారు. శనివారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి మంత్రులు ఇళంగోవన్ భౌతికకాయానికి ఘననివాళులర్పించారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదివారం ఉదయం మనపాక్కంలోని ఇళంగోవన్ నివాసానికి వెళ్లి రెండోమారు ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. డీఎంకే ఎంపీ కనిమొళి, మంత్రులు పొన్ముడి, ముత్తుసామి, దామో అన్బరసన్, ఎం.సుబ్రమణ్యం, టీఎన్‌సీసీ నేత సెల్వపెరుంతగై కూడా దివంగత నేతలకు నివాళులర్పించారు. కాంగ్రెస్ శాసనసభ్యుడిగా, ఎంపీగా, కేంద్ర మంత్రిగా ఇళంగోవన్ చేసిన సేవలను కొనియాడే లా ఆయన అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో జరుగుతాయని స్టాలిన్ ప్రకటించారు. ఇదిలా ఉండగా ఆదివారం సాయంత్రం వరకూ మనపాక్కంలోని ఇళంగోవన్ నివాసానికి వివిధ రాజకీయ పార్టీల నేతలు ఆయన భౌతికకాయానికి నివాళులర్పించేందుకు బారులు తీరారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, పార్టీ ప్రముఖుడు కరాటే త్యాగరాజన్, టీఎంసీ నేత జీకే వాసన్ తదితరులు ఇళంగోవన్ భౌతికకాయానికి నివాళులర్పించారు. తరువాత మనపాక్కం నివాసం నుంచి ప్రత్యేకవాహనంలో ఇళంగోవన్ భౌతిక కాయం అంతిమ యాత్ర ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి ఎం.సుబ్రమణ్యం, కాంగ్రెస్ నేతలు సెల్వపెరుంతగై తదితరులు ముగిలివాక్కం విద్యుత్ శ్మశానవాటిక వరకూ ఊరేగింపుగా వెళ్లారు. ఆ చోట ఇళంగోవన్ భౌతికకాయానికి ప్రభుత్వ లాంఛనాలతో విద్యుత్ దహన వాటికలో దహన క్రియలను నిర్వహించారు.



ఇళంగోవన్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ కనిమొళి



నివాళులర్పిస్తున్న అన్నామలై



ఇళంగోవన్ అంతిమయాత్రలో పాల్గొన్న టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, ఎంపీ జ్యోతిమణి తదితరులు

సమాచార దృష్టి

సోరిముత్తు అయ్యనార్ ఆలయంలో భక్తులకు ప్రవేశం

పెరంబూర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా కళక్కాడు ముండతురై పులుల శరణాలయ ప్రాంతంలో ఉన్న సోరముత్తు అయ్యానార్ ఆలయానికి భక్తులు వెళ్లేందుకు అనుమతించారు. అదే సమయంలో అగస్తియర్ జలపాతం వద్దకు పర్యాటకులు వెళ్లడంపై విధించిన నిషేధం కొనసాగుతుందని అటవీ శాఖ తెలిపింది.

మెరీనా లూప్ రోడ్డు ఆధునికీకరణ

పెరంబూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) స్థానిక మెరీనా బీచ్ సమీపంలోని లూప్ రోడ్డును వివిధ వినోద సౌకర్యాలతో ఆధునికీకరించాలని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) నిర్ణయించింది. ఇందుకోసం రూ.15 లక్షలతో సమగ్ర ప్రణాళిక నివేదిక తయారీకి టెండర్లు ఆహ్వానించినట్లు అధికారులు తెలిపారు.

రామేశ్వరం ఆలయ వేళల్లో మార్పులు

పెరంబూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మార్గళి మాసం సందర్భంగా రామేశ్వరం రామనాథస్వామి ఆలయాన్ని సోమవారం నుంచి వేకువజామున 3.30 గంటలకు తెరవనున్నారు. సోమవారం నుంచి జనవరి 13వ తేది వరకు ఈ మార్పులుంటాయి.. ఆ ప్రకారం, తెల్లవారుజామున 4 నుంచి 4.30 గంటల వరకు స్పటిక లింగ పూజ దర్శనం, 5 గంటలకు మేల్కొలుపు, అనంతరం దేవారం, తిరువెంబ పారాయణం, దీపారాధన నిర్వహిస్తారు. ఉదయం 6 గంటలకు తిరువనందల్ పూజ, 10 గంటలకు కాల శాంతి పూజ, మధ్యాహ్నం 12 గంటలకు ఉచ్చికాల పూజలు, మధ్యాహ్నం, సాయంత్రం పూజలు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

తాంబరం-కోవై రైలు సేవలు పొడిగింపు

పెరంబూర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): తాంబరం-కోయంబత్తూర్ వారాంతపు ప్రత్యేక రైలు సేవలు ఫిబ్రవరి వరకు పొడిగిస్తున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, నెం.06184: తాంబరం-కోవై ప్రత్యేక వారాంతపు రైలు ప్రతి శుక్రవారం సాయంత్రం 6 గంటలకు తాంబరం నుంచి బయల్దేరి ఉదయం 8.10 గంటలకు కోవై చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06185 కోవై-తాంబరం ప్రత్యేక వారాంతపు రైలు ప్రతి ఆదివారం కోవై నుంచి రాత్రి 11.45 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12.30 గంటలకు తాంబరం చేరుకుంటుంది. ఈ రైలు సేవలు ఫిబ్రవరి 9వ తేది వరకు పొడిగించారు.

పూర్తిస్థాయికి చేరువలో మేట్టూరు డ్యాం

పెరంబూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెద్ద జలాశయమైన సేలం జిల్లా మేట్టూరు డ్యాం మరోసారి పూర్తిస్థాయి (120 అడుగులు) చేరే అవకాశముంది. ఆదివారం ఉదయం జలాశయాలోకి 7,460 ఘనపుటడుగుల నీరు వచ్చి చేరుతుండగా, డెల్టా సాగు కోసం 1,300 ఘనపుటడుగులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 117.90 అడుగులు (90.15) టీఎంసీల నీటి నిల్వలున్నాయి నీటి రాక ఇలాగే కొనసాగితే త్వరలో డ్యాం పూర్తిస్థాయికి చేరుకొనే అవకాశముందని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

ఆవిన్ 'గ్రీన్ మ్యాజిక్ ప్లస్' ప్యాకెట్ రూ.25

పెరంబూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) 'విటమిన్ ఏ, డి' సమృద్ధిగా ఉన్న 'గ్రీన్ మ్యాజిక్ ప్లస్' పేరుతో పాలు విక్రయించనున్నట్లు ఆవిన్ ఇటీవల ప్రకటించింది. తాజాగా, 450 మి.లీ గ్రీన్ మ్యాజిక్ ప్లస్ పాల ప్యాకెట్ రూ.25గా నిర్ణయించింది. ఈ నెల 18వ తేది నుంచి ఈ పాల ప్యాకెట్లు అందుబాటులో ఉంటాయని ఆవిన్ తెలిపింది.

మూడు అటవీ ప్రాంతాల అభివృద్ధి

పెరంబూర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ గుర్తింపు పొందిన నీలగిరి, తిరుప్పూర్, విల్లుపురం జిల్లాల్లోని అటవీ ప్రాంతాల అభివృద్ధికి అటవీ శాఖ సమీకృత నిర్వహణ ప్రణాళిక తయారు చేస్తోంది. ఆ ప్రకారం, నీలగిరి జిల్లా 286 ఎకరాల విస్తీర్ణం కలిగిన లాంగ్‌వుడ్ ఒయాసిస్ ఫారెస్ట్, తిరుప్పూర్ జిల్లాలో 308 ఎకరాల నంజరాయన్ పక్షుల శరణాలయం, విల్లుపురం జిల్లా కళివెలి ప్రాంతంలో 12,728 ఎకరాల పక్షుల శరణాయాలను అభివృద్ధి చేయనున్నారు. ఇందుకోసం సమీకృత నిర్వహణ ప్రణాళిక తయారీకి సంస్థను ఏర్పాటుచేసే పనులు చేపట్టినట్లు అటవీ శాఖ తెలిపింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

తండయార్‌పేట: కుమ్మాళమ్మన్ ఆలయ వీధి, జీఏ రోడ్డు, టీహెచ్ రోడ్డు కొంత భాగం, సోలయమ్మన్ వీధి, కప్పల్‌బాలు వీధి, వీబీ ఆలయ వీధి, తాండవరాయన్ వీధి, రైనీ హాస్పిటల్, రంగమ్మాళ్ వీధి, రామానుజం వీధి, సంజీవరాయన్ వీధి, సుబ్బరాయన్ వీధి, బాలు మొదలి వీధి, పాత వాషర్‌మెన్‌పేట, లింక్ రోడ్డు కొంత భాగం, మన్నప్పన్ వీధి కొంత భాగం, తంగవేల్ వీధి, నైనియప్పన్ వీధి, పెరుమాళ్ ఆలయ వీధి, వీరకుట్టి వీధి, కేజీ గార్డన్, మేయర్ బాసుదేవ్ వీధి

గుమ్మిడిపూండి: కనిష్క్, అరుణ్ స్మెల్టర్స్, సెంచురి ప్లైవుడ్, మిత్సుబా కన్యాకుమర్, ఎలావూర్ బజార్, సున్నాంబుకుళం, పెద్దికుప్పం, కైలార్‌మేడు, ఆరంబాక్కం బజార్, నొచ్చికుప్పం, ఈగమాదురై.

పగలు ఆటో డ్రైవర్లు.. రాత్రి దోపిడీ దొంగలు!

● కోవైలో ముగ్గురి అరెస్టు

టి.నగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు నీలాంబూరు ప్రాంతంలో పగటిపూట ఆటోడ్రైవర్లుగా ఉంటూ రాత్రివేళ దారిదోపిడీలు, ఇళ్లల్లో దోపిడీలు చేసిన ముగ్గురిని పోలసులు అరెస్టు చేశారు. కోయంబత్తూరు జిల్లా సూలూరుకు చెందిన రాహుల్ (23) నీలాంబూరు వద్ద రహదారిలో నడచి వెళుతుండగా ఆటోలో వచ్చిన ముగ్గురు దుండగులు అతడి సెల్‌ఫోన్, జేబుల్లో ఉన్న నగదు దోచుకుని మాయమయ్యారు. దీనిపై రాహుల్ సూలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు జరిపి ఈ దారిదోపిడీతో సంబంధం ఉన్న మయిలంపట్టికి చెందిన గణేశన్ (40), ఊటీకి చెందిన రఘునాథ్ (27), పీలమేడుకు చెందిన కార్తీక్ (19) అనే వారిని అరెస్టు చేశారు. వారి నుంచి ఓ ఆటో, నగలు, సెల్‌ఫోన్, నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో పగటి పూట ఆటోలను నడుపుతూ, రాత్రిపూట దారిదోపిడీలకు పాల్పడినట్లు గుర్తించారు. కోయంబత్తూరు పరిసరాల్లో జరిగిన పలు చోరీలు, దారిదోపిడీలతో ఈ ముగ్గురికీ సంబంధాలు ఉన్నాయని పోలీసులు తెలిపారు.


అరెస్టయిన ఆటోడ్రైవర్లు

పంట దిగుబడి పోటీలకు ఆహ్వానం

పెరంబూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత ఏడాది పంట దిగుబడి పోటీలు నిర్వహిస్తుంటారు. ఆ ప్రకారం, ఈ ఏడాది జిల్లా స్థాయి పంట దిగుబడి పోటీలకు దరఖాస్తు చేసుకోవచ్చు. చెరకు, మినుము, పచ్చి మిర్చి, వరి, సంప్రదాయ వరి సాగుచేసే రైతులు ఈ పోటీలో పాల్గొనవచ్చు. ఈ పోటీల్లో రాష్ట్రస్థాయిలో అధిక దిగుబడి సాధించిన రైతులకు రూ.5 లక్షలు, నారాయణస్వామి నాయుడు వరి ఉత్పాదక అవార్డు అంజేయనున్నారు. పోటీల్లో పాల్గొనే రైతు కనీసం 2 ఎకరాల విస్తీర్ణంలో సేంద్రియ వ్యవసాయం చేసిన వారై ఉండాలి. రైతులతో పాటు కౌలు రైతులు కూడా పోటీలో పాల్గొనవచ్చు. రూ.150 రుసుముతో దరఖాస్తుతో పాటు సాగు భూమి చిట్టా, అడంగళ్ తదితరాలు జతచేసి మార్చి 31 లోపు ప్రాంతీయ వ్యవసాయ సహాయ సంచాలకులకు సమర్పించాలి. దరఖాస్తు చేసుకున్న వారు ఏప్రిల్ 15 లోపు పంట కోత కోయాలని అధికారులు తెలిపారు.

కేంద్రప్రభుత్వ తీరును ఖండించిన స్పీకర్

పెరంబూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) విపత్తు నివారణ నిధులు అందజేయడంలో కేంద్ర ప్రభుత్వ తీరును ఖండిస్తున్నట్లు స్పీకర్ అప్పావు తెలిపారు. నాగర్‌కోయిల్‌లో ఆదివారం స్పీకర్ మీడియాతో మాట్లాడుతూ... దక్షిణ జిల్లాల్లో ప్రస్తుతం భారీవర్షాలు కురుస్తున్నాయన్నారు. తెన్‌కాశి, తిరునల్వేలి, తూత్తుకుడి జిల్లాలు తీవ్ర నష్టం చవిచూశారన్నారు. మంత్రులు వరద బాధిత ప్రాంతాల్లో పర్యటిస్తూ సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి స్టాలిన్ 24 గంటలకు వరద బాధితులకు సహాయాలు అందజేయడం, బాధిత ప్రాంతాల్లో సత్వరం చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు సూచనచేస్తున్నారన్నారు. ఎలాంటి విపత్తులనైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కానీ, విపత్తుల సమయాల్లో బాధిత రాష్ట్రాలను ఆదుకోవాల్సిన కేంద్రం, తమ బాధ్యత విస్మరించిందని స్పీకర్ ఆరోపించారు.

వ్యాపిస్తున్న జ్వరం, దగ్గు, జలుబు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా జ్వరం, దగ్గు, జలుబు లక్షణాలతో 8 లక్షల మంది బాధపడుతున్నట్లు ఆరోగ్యశాఖ తెలిపింది. వర్షాకాలం ప్రారంభంలోనే రాష్ట్రవ్యాప్తంగా ఇన్‌ఫ్లుయెంజా, డెంగ్యూ, చికెన్‌గున్యా, టైఫాయిడ్ తదితర జ్వరాలు వ్యాపిస్తున్నాయి. వాటిలో ఇన్‌ఫ్లుయెంజా జ్వరంతో 75 శాతం మంది బాధపడుతున్నారు. ఈ సీజన్‌లో వ్యాపించే జ్వరాలపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అదే సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని ఆరోగ్యశాఖ సూచిస్తోంది. ఒక ప్రాంతంలో జ్వర బాధితుల సంఖ్య అధికంగా ఉంటే సత్వరం ఆ ప్రాంతంలో ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపింది.

ముమ్మరంగా కొండ రైలు మార్గం మరమ్మతులు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కున్నూర్ సమీపంలో కొండ రైలు మార్గం మరమ్మతుపనులు శరవేగంగా జరుగుతున్నాయి. కోవై జిల్లా మేట్టుపాళయం నుంచి నీలగిరి జిల్లా ఊటీకి నడిపే కొండ రైలులో ప్రయాణించేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతుంటారు. ఈ మార్గంలో 16 గుహలు, 250 వంతెనల మీదుగా రైలు ప్రయాణిస్తుంది. కొద్దిరోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా ముందస్తు చర్యలతో కొండ రైలు సేవలు ఈ నెల 17వ తేది వరకు తాత్కాలికంగా నిలిపివేశారు. ప్రస్తుతం కొండ రైలు మార్గంలో దెబ్బతిన్న దిమ్మెలు, పట్టాలపై పడిన మట్టిచెరయలు, చెట్లను తొలగించే పనుల్లో సుమారు 50 మంది కార్మికులు పనిచేస్తున్నారు.


మరమ్మతుల్లో రైల్వే కార్మికులు

విద్యార్థుల గదుల్లో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ కునియముత్తూర్ పోలీసులు, శనివారం రాత్రి విద్యార్థుల గదుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కోవై నగరం, జిల్లాలోని పలు ప్రాంతాల్లో కళాశాల విద్యార్థులు మాదక ద్రవ్యాలు వినియోగిస్తున్నట్లు ఫిర్యాదులున్నాయి. గతంలో కోవై నగరంలో విద్యార్థులుంటున్న మెస్‌లు, మాన్షన్స్, అపార్ట్‌మెంట్లలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో, శనివారం కోవైపుదూర్, పీకే పుదూర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో విద్యార్థులు బసచేస్తున్న గదుల్లో ఇన్‌స్పెక్టర్లు భాస్కరన్, తంగం నేతృత్వంలో 20 పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఎలాంటి మాదకద్రవ్యాలు లభించలేదని సమాచారం.


తనిఖీలు చేస్తున్న పోలీసులు

పుళల్ జైలుకు ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసు నిందితులు

పెరంబూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసు ముద్దాయిలను పుళల్ జైలుకు తరలించారు. ఈ హత్యకేసులో అశ్వత్థామన్, పొన్నై బాలు సహా 23 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు, వారిని పూందమల్లి జైలుకు తరలించారు. ప్రస్తుతం వీరిని భారీ పోలీసు బందోబస్తు నడుమ పుళల్ జైలుకు తరలించారు.

క్రీడల కోటాలో కరాటే చేర్చాలంటూ పిటిషన్

● తోసిపుచ్చిన హైకోర్టు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): క్రీడల కోటాలో కరాటే ను చేర్చాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు తోసిపుచ్చింది. స్థానిక ఆవడికి చెందిన కరాటే క్రీడాకారులు అరుణ్ ప్రభాకరన్ హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌లో... ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ పరీక్షల్లో, క్రీడాకారులకు 10 శాతం కేటాయించారని, ఆ జాబితాలో కరాటే కూడా చేర్చాలని ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించినా, ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. అందువల్ల, కరాటేను చేర్చేలా ప్రభుత్వానికి ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ ప్రధాన న్యాయమూర్తి కేఆర్ శ్రీరామ్, న్యాయమూర్తి సెంథిల్‌కుమార్ రామమూర్తిలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఆ సమయంలో ప్రభుత్వ తరపు న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు. అనంతరం ధర్మాసనం, క్రీడల రిజర్వేషన్‌లో కరాటేను చేర్చడంపై ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకోవాలని, ఈ వ్యవహారంలో కోర్టు ఉత్తర్వులు జారీచేయాలా అనే ప్రశ్న లేదంటూ, పిటిషన్ తోసిపుచ్చుతూ ఉత్తర్వులు జారీచేశారు.

మేలూరులో కార్తీక మట్టి ఉత్సవం

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నరసింగంపట్టణంలో కార్తీక మాసం ఉత్సవాల సందర్భంగా భక్తులు మట్టి కొండపై ఉప్పు, కారం చల్లుతూ పూజలు చేశారు. మదురై జిల్లా నరసింగంపట్టి పెరుమాళ్ కొండ ఆలయానికి ఓ ప్రత్యేకత ఉంది. ఆలయంలో నిర్వహించే ఉత్సవాల్లో చుట్టుపక్కల గ్రామాల భక్తులు పాల్గొంటారు. మొదట ఆలయం ముందున్న వాగులో పుణ్యస్నానాలు చేసి, వాగు నుంచి పిడికెడు మట్టి తీసుకొచ్చి ఆలయ ముందు వేసి పూజలు చేస్తుంటారు. అలా ఎన్నో ఏళ్లుగా భక్తులు వేసిన మట్టి ప్రస్తుతం పెద్ద కొండలా మారింది. ఈ మట్టి కొండ ముందు చేరే భక్తులు ఉప్పు, కారం చల్లి పూజలు చేస్తుంటారు. అలాగే, సంతానం పొందిన భక్తులు, పిల్లలను చెరకు ఊయల్లో వేసి కొండ చుట్టూ ప్రదక్షిణలు చేస్తుంటారు. శనివారం జరిగిన వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.


మట్టి కొండపై ఉప్పు, కారం చల్లుతున్న భక్తులు

కాలపరిమితి దాటిన పంచామృతం స్వాధీనం

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి సుబ్రమణ్య స్వామి కొండ ఆలయం పరిసర ప్రాంతాల్లోని దుకాణాల్లో కాలపరిమితి దాటిన 50 కిలోల పంచామృతం డబ్బాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రపంచ ప్రసిద్ధిచెందిన ఈ ఆలయానికి ప్రతిరోజు భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. ఆలయానికి చెందిన 10 దుకాణాలకు ప్రతి ఏడాది వేలం నిర్వహిస్తుంటారు. వేలంలో దుకాణాలు పొందిన వారు పూజా సామగ్రి, పంచామృతం, మురుగన్ చిత్రాలు, దారాలు విక్రయిస్తుంటారు. ముఖ్యంగా, పంచామృతం 250 గ్రాముల నుంచి ఒకటిన్నర కిలో వరకు డబ్బాలో విక్రయిస్తుంటారు. ఇటీవల ఆ దుకాణాల్లో పంచామృతం కొనుగోలు చేసిన కొందరు భక్తులు, కాలపరిమితి చెందినది విక్రయిస్తున్నారంటూ దేవాదాయ శాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో తిరుత్తణి ఆలయ జాయింట్ కమిషనర్ రమణి నేతృత్వంలో అధికారులు దుకాణాల్లో తనిఖీలు చేపటారు. పంచామృతం డబ్బాలపై ఉన్న తయారు తేది, కాలపరిమితి తదితరాలు పరిశీలించి, కాలపరిమతి తీరిన 50 కిలోల పంచామృతం స్వాధీనం చేసుకున్నారు.


దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న అధికారులు

పడవ బోల్తాపడి నీట మునిగిన జాలర్లు

● రక్షించిన సహచరులు

టి.నగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం సమీపంలో పడవ బోల్తాపడి సముద్రంలో మునిగిన ఏడుగురు జాలర్లను ఆ ప్రాంతంలోనే నాటుపడవలో చేపలు పడుతున్న జాలర్లు కాపాడి ఒడ్డుకు చేర్చారు. భారీ వర్షాల కారణంగా ఐదు రోజులపాటు ఇంటివద్దనే ఉన్న రామేశ్వరం జాలర్లు శనివారం చేపలవేటకు వెళ్లారు. మణివన్నన్ అనే వ్యక్తి చెందిన మరపడవలో ఆరుముగం, కుమార్, మురుగన్, సేతుపతి, మాధవన్, కన్నన్, జస్టీన్ అనే జాలర్లు చేపలవేటకు బయలుదేరారు. రామేశ్వరం నుంచి రెండు నాటికల్ మైళ్ల దూరంలో వీరు చేపలుపడుతుండగా పడవ అడుగు భాగంలో ఉన్న కొయ్య పలక పగిలి నీటిలో కొట్టుకుపోయింది. వెంటనే ఆ జాలర్లు అక్కడికి సమీపంలో చేపలుపడుతున్న తమ సహచరులకు సెల్‌ఫోన్ ద్వారా ఆ సమాచారం తెలిపారు. ఆలోగా పడవలోకి సముద్రపు నీరు ప్రవేశించడంతో పడవ బోల్తాపడి ఏడుగురు జాలర్లు నీట మునిగారు. వారు ఈతకొడుతూ తమను కాపాడేవారికి కోసం ఎదురు చూడసాగారు. అరగంట తర్వాత నాటు పడవలో వచ్చిన జాలర్లు ఆ ఏడుగురిని తమ పడవల్లో ఎక్కించుకుని తీరానికి చేర్చారు.


సురక్షితంగా తీరం చేరిన రామేశ్వరం జాలర్లు

కార్ సర్వీస్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

ప్యారీస్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెడ్‌హిల్స్ సమీంలోని దండల్‌కలని ప్రాంతంలోని మహేంద్ర కార్ సర్వీస్ సెంటర్‌లో ఆదివారం సంభవించిన అగ్నిప్రమాదంలో 11 కార్లు దగ్గమయ్యాయి. ఈ సెంటర్‌లో ఉదయం 6 గంటలకు నల్లటి పొగలు రావడం చూసి స్థానికులు, రెడ్‌హిల్స్ అగ్నిమాపక శాఖ కార్యాలయానికి సమాచారం అందించారు. ఆ సెంటర్‌లో మంటలు ఎగసిపడుతుండడంతో మాధవరం, అంబత్తూర్, సెంబియం ప్రాంతాల నుంచి సుమారు 15కు పైగా ఫైరింజన్లతో సంఘటనా స్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మూడు గంటలు శ్రమించి మంటలు అదుపుచేశారు. ఈ ప్రమాదంలో 11 కార్లు మంటల్లో దగ్ధమయ్యాయి. దీనిపై పోలీసులు కేసు నమోదుచేసి విచారించారు.

చెన్నై ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా సురేష్

చెన్నై, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చెన్నైప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా దినకరన్ పత్రిక చీఫ్ రిపోర్టర్ సురేష్ వేదనాయగం ఎన్నికయ్యారు. రెండు దశాబ్దాల తరువాత ఆదివారం జరిగిన ప్రెస్‌క్లబ్ ఎన్నికల్లో సురేష్ వేదనాయగం 659 ఓట్లు సాధిం చి ప్రత్యర్థులను చిత్తు చేశారు. అదేవిధంగా ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శిగా ఆసిఫ్ మహ్మద్, సంయుక్త కార్యదర్శిగా నెల్సన్ వెట్రి, కోశాధికారిగా మణికంఠన్, ఉపాధ్యక్షులుగా సుందర భారతి, మదన్, కమిటీ సభ్యులుగా స్టాలిన్, గవాస్కర్, విజయగోపాల్, అఖిల, పళని విజయం సాధించారు. 1502 మంది సభ్యులున్న చెన్నై ప్రెస్‌క్లబ్‌కు మద్రాస్ హైకోర్టు ఆదేశాల మేరకు రిటైర్డ్ న్యాయమూర్తి పర్యవేక్షణలో ఆదివారం ఎన్నికలు జరగగా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



18న కోవైలో క్రిస్మస్ వేడుకలు

● హాజరుకానున్న డిప్యూటీ సీఎం

ప్యారీస్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కోవైలో ఈ నెల 18వ తేది జరుగనున్న క్రిస్మస్ వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పాల్గొననున్నారు. తమిళనాడు స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో 'నాన్ ముదల్వన్' పథకం ద్వారా నిరుద్యోగ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై రాష్ట్రంలోని 24 జిల్లాల్లో ఉన్న 31 ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలల్లో శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం రూ.30.62 కోట్లు కేటాయించింది. ఈ కేంద్రం ప్రారంభోత్సవం ఈ నెల 18న జరుగనుంది. కోవై శక్తి రోడ్డులో ఉన్న బేతేల్ ప్రార్థనా మందిరంలో నిర్వహించనున్న క్రిస్మస్ వేడుకల్లో రాష్ట్ర మంత్రులు ఏవీ వేలు, సెంథిల్ బాలాజీలతో పాటు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి కూడా పాల్గొననున్నారు.

రైల్వే టీసీ అనుమానాస్పద మృతి

అడయార్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పొన్నేరి సమీపంలోని శక్తి నగర్‌లో రైల్వే టిక్కెట్ కలెక్టర్ ఒకరు అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు.. ఈ ప్రాంతంలో రవి (38) చెన్నై సెంట్రల్‌లో టిక్కెట్ కలెక్టరుగా పనిచేస్తూ, పొన్నేరి శక్తి నగర్‌లో కుటుంబంతో జీవిస్తున్నారు. వారం రోజుల క్రితం ఆయన భార్య బంధువుల వివాహం కోసం కర్ణాటక రాష్ట్రానికి వెళ్లింది. దీంతో ఇంటిలో రవి ఒక్కరే ఉంటున్నారు. ఈ క్రమంలో ఆయన ఆదివారం ఉదయం ఇంటిలో శవమై ఉండడం గమనించిన ఇరుగుపొరుగువారు పోలీసులకు సమాచారమిచ్చారు. పొన్నేరి పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, రవి ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

మదురై జైల్లో అవినీతి

● ఎస్పీ సహా 11 మందిపై కేసు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మదురై కేంద్ర కారాగారంలో పరిశ్రమలకు సంబంధించిన ముడిసరుకుల కొనుగోళ్లలో అవినీతి జరిగిందనే ఫిర్యాదుల నేపథ్యంలో, పాత ఎస్పీ ఊర్మిళ సహా 11 మందిపై ఏసీబీ కేసు నమోదుచేసింది. ఈ జైలులో ఖైదీలు వైద్యానికి అవసరమైన బ్యాండేజి, ఆఫీసు కవర్లు సహా పలు వస్తువులు తయారుచేస్తున్నారు. 2016 నుంచి 2021 వరకు ఎస్పీగా ఊర్మిళ వ్యవహరించగా, ప్రస్తుతం ఆమె కడలూరు జైలు సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. ఆమె విధుల్లో ఉన్న 2019 నుంచి 2021 వరకు ఉత్పత్తులకు అవసరమైన ముడిసరుకులను చెన్నైలోని పలువురు వ్యాపారుల నుంచి కొనుగోలు చేశారు. ఈ సంస్థల నుంచి సరుకులు కొనుగోలు చేసినట్లు నకిలీ బిల్లులు తయారుచేసి జైలు శాఖ సమర్పించారు. దాని ద్వారా రూ.1.63 కోట్ల వరకు అవినీతి జరిగిందని ఫిర్యాదులందాయి. ఈ వ్యహరానికి సంబంధించి కేసు హైకోర్టులో విచారణలో ఉంది. విచారణ జరుగుతున్న నేపథ్యంలో, ఊర్మిళ సహా 11 మందిపై మదురై అవినీతి నిరోధక శాఖ పోలీసులు కేసు నమోదుచేశారు.

క్రెడిట్ కార్డు నుంచి రూ.1.38 లక్షల చోరీ

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రహస్య నెంబరు లేకుండానే ఓ డ్రైవర్ క్రెడిట్ కార్డు నుంచి రూ.1.38 లక్షలు డెబిట్ చేయబడింది. రాయపేట శ్రీనివాస పెరుమాళ్ సన్నిధి మొదటి వీధికి చెందిన డ్రైవర్ శ్రీనివాసన్, పదేళ్లుగా క్రెడిట్ కార్డు వినియోగిస్తున్నాడు. ఈ నెల 7న శ్రీనివాసన్ రాయపేట వుడ్‌ల్యాండ్స్ థియేటర్ సమీపంలోని పెట్రోల్ బంక్ లో తన వాహనానికి రూ.300 పెట్రోల్ పోయించుకొని, ఆ నగదును క్రెడిట్ కార్డు ద్వారా చెల్లించాడు. అనంతరం ఇంటికి వెళ్లి సెల్‌ఫోన్‌కు వచ్చిన మెసేజ్ చూసి దిగ్భ్రాంతి చెందాడు. అందులో, అతని క్రెడిట్ కార్డు నుంచి బెంగళూరు, ముంబై తదితర ప్రాంతాల్లో 13 సార్లు రూ.10,000, రెండు సార్లు తలా రూ.4,000 అని మొత్తం రూ.1.38 లక్షలు వినియోగించినట్లు మెసేజ్‌లున్నాయి. ఈ వ్యవహారంపై శ్రీనివాసన్ బ్యాంక్ అధికారులను సంప్రదించగా, వారు పోలీసులకు ఫిర్యాదు చేయాలని సలహా ఇచ్చారు. దీంతో, శ్రీనివాసన్ అందజేసిన ఫిర్యాదుపై సైబర్ క్రైం పోలీసులు విచారణ చేపట్టారు.

లోక్ అదాలత్‌లో 82,257 కేసుల విచారణ

● రూ.576.32 కోట్ల పరిహారం చెల్లింపు

ప్యారీస్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయపనుల కమిషన్ ఆధ్వర్యంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులకు పరిష్కారం కల్పించే లా లోక్ అదాలత్ న్యాయస్థానాల్లో 832,257 కేసులను విచారించి, రూ.576.32 కోట్ల పరిహారాన్ని బాధితులకు అందజేశారు. మోటారు వాహన ప్రమాదాలు, కార్మికుల సమస్యలు, విడాకులు, కుటుంబ సంక్షేమం, భూతగాదా, చెక్ బౌన్స్ కేసులు దీర్ఘకాలంగా ఉండడంతో, వాటికి పరిష్కారం కల్పించేలా మద్రాసు హైకోర్టు సహా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న న్యాయస్థానాల్లో లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందుకోసం మద్రాసు హైకోర్టులో 8 ప్రత్యేక బెంచ్‌లు, మదురై హైకోర్టులో 4 ప్రత్యేక బెంచ్‌లు, జిల్లా కోర్టులు మొత్తం 479 ప్రత్యేక బెంచ్‌ల్లో 82 వేలకు పైగా కేసులపై విచారణ జరిపి, బాధితులకు పరిహారం అందజేసినట్లు రాష్ట్ర న్యాయ శాఖ పనుల కమిషన్ కమిటీ కార్యదర్శి కె.సుధ పేర్కొన్నారు. అదే విధంగా, లోక్ అదాలత్ ద్వారా నగరంలో 1,032 చిన్న కేసులు విచారించి, రూ.54.46 కోట్లు పరిహారం అందజేయాల్సిందిగా చిన్న కేసుల న్యాయస్థానం రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీచేశారు.

39 వేల చెరువులతో 200 టీఎంసీల నీరు

● జాతీయ రైతు సంఘాల సమాఖ్య తీర్మానం

టి.నగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆక్రమణలకు గురైన 39 వేలకు పైగా చెరువులను స్వాధీనం చేసుకుని 200 టీఎంసీల వరకు సాగునీటిని నిల్వచేసే పథకం అమలు చేయాల్సిన అవసరం ఉందని రైతు సంఘాల ప్రతినిధుల జాతీయ సమావేశం తీర్మానించింది. రాష్ట్ర రైతు సంఘాల సమాఖ్య కార్యాచరణ కమిటీ రాష్ట్ర చెరువుల విముక్తి సంఘం తదితర సంఘాల తరపున వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర నిర్ణయం, సాగుజలాల నిర్వహణ తదితర అంశాలకు సంబంధించి చర్చలు జరిపే నిమిత్తం వివిధ రాష్ట్రాల రైతు సంఘాల ప్రతినిధులతో ఎగ్మూరులో సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర రైతు సంఘాల సమాఖ్య కార్యాచరణ కమిటీ సమన్వయ కర్త డి.గురుసామి సమక్షంలో వ్యవసాయ ఉత్పత్తులకు కనీస గిట్టుబాటు ధర కోసం పోరాడుతున్న రైతుల సంఘం జాతీయ అధ్యక్షుడు వీఎం సింగ్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర రైతుల సంఘాల నాయకులే కాకుండా ఉత్తరాది రాష్ట్రాల రైతు సంఘాల ప్రతినిధులు, నీటి వనరుల విభాగం ఇంజనీరింగ్ నిపుణులు కూడా హాజరయ్యారు. ఈ సమావేశానంతరం వీఎం సింగ్ మాట్లాడుతూ సాగునీటి కొరత, ఉత్పత్తుల గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతుల జీవనం సవాలుగా మారిందన్నారు. వీటికి తగు పరిష్కార మార్గాలను కనుగొనే నిమిత్తం వివిధ రాష్ట్రాలకు చెందిన రైతు సంఘాల ప్రతినిధులు సమగ్రంగా చర్చించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో రైతుల ఉత్పత్తులకు కనీసపక్ష మద్దతు ధరను స్థిరీకరిస్తూ కేంద్రం ఓ చట్టాన్ని రూపొందించి, దానిని అన్ని రాష్ట్రాలలో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఓ తీర్మానం ప్రతిపాదించినట్లు ఆయన చెప్పారు. ఈ సమావేశంలో మహారాష్ట్ర చెరకు రైతుల సంఘం అధ్యక్షుడు రాజూశెట్టి, జాతీయ రైతు సంఘాల అధ్యక్షుడు సంజయ్‌నాథ్ సింగ్, భారతీయ కిసాన్ యూనియన్ అధ్యక్షుడు బల్‌రాజ్ పాటిల్, మహిళా విభాగం అధ్యక్షురాలు రేఖా సివాల్ తదితరులు పాల్గొన్నారు.


విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న వీఎం సింగ్

హౌసింగ్ బోర్డు ఫ్లాట్లలో పోలీసులకు అద్దెకు ఇల్లు

పెరంబూర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): హౌసింగ్ బోర్డు నిర్మిస్తున్న ఫ్లాట్లలో ఖాళీగా ఉన్న ఇళ్లు పోలీసులకు అద్దెకు ఇవ్వనున్నారు. రాష్ట్ర పోలీసు శాఖలో లక్ష మందికి పైగా పోలీసులుండగా, పోలీసు హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో ఇళ్లు నిర్మించి తక్కువ అద్దెకు ఇస్తున్నారు. కానీ, ప్రస్తుతం 40 శాతం మంది పోలీసులకు మాత్రమే ఇళ్లు లభించడంతో మిగిలిన వారు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో, హౌసింగ్ బోర్డు నిర్మించిన ఫ్లాట్లలో ఖాళీగా ఉన్న ఇళ్లు పోలీసులకు అద్దెకు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ ఇళ్ల కోసం పోలీసులు దరఖాస్తు చేసుకోవాలని నగర పోలీసు శాఖ తెలిపింది.

కోడలు కాపురానికి రాలేదనీ... ఒకే కుటుంబంలో ముగ్గురి ఆత్మహత్య

అడయార్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అలిగి వెళ్ళిన కోడలు తిరిగి కాపురానికి రాకపోవడంతో తీవ్ర మనస్థాపానికి లోనైన అత్తమామలతో పాటు భర్త కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాదకర ఘటన నామక్కల్ జిల్లా ఎరుంబట్టి ఏ.వాళవంది గ్రామంలోని అరుంధతీయ కాలనీలో జరిగింది. పోలీసుల కథనం మేరకు... ఈ కాలనీకి చెందన సెల్వరాజ్(50), పూంగొడి (47) దంపతులతోపాటు వీరి కుమారుడు సురేందర్ (25) నివశిస్తున్నాడు. ఇతనికి ఆరు నెలల క్రితం అదే జిల్లాకు చెందిన స్నేహ అనే యువతితో వివాహం జరిగింది. ఈ ఏడు నెలలోనే భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తాయి. దీంతో స్నేహ అలిగి తన పుట్టింటికి వెళ్ళిపోయింది.ఆ తర్వాత సెల్వరాజ్ దంపతులు తమ కుమారుడితో కలిసి వియ్యంకుడి ఇంటికి వెళ్ళి కోడలిని కాపురానికి పంపాలని పలుమార్లు కోరారు. అయితే, స్నేహ మాత్రం కాపురానికి వచ్చేందుకు నిరాకరించింది. దీంతో భర్త సురేందర్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. కుమారుడు విచారంలో మునిగిపోవడాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోయారు. ఈ క్రమంలో శనివారం రాత్రి తమ కుమారుడి సహా భార్యాభర్తలు ఇంట్లోనే ఉరేసుకుని ప్రాణాలు తీసుకున్నారు. సమాచారం అందుకున్న ఎరుంబపట్టి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి చేపట్టిన ప్రాథమిక విచారణలో.. వివాహమైన తర్వాత వేరు కాపురానికి తాను ఒత్తిడి చేయగా, భర్త, అత్తమామలు నిరాకరించారని, అందుకే తాను పుట్టింటికి వచ్చేశానని స్నేహ తెలిపింది. కేసు విచారణ జరుపుతున్నారు.

యుద్ధానికి వెళ్ళే శునకం పేరు 'అలంగు' : నిర్మాత సఘమిత్ర

రాజరాజ చోళుని కాలంలో యుద్ధభూమికి వెళ్ళిన శునకాలను 'అలంగు' అని పిలిచేవారని, ఆ పేరునే ఈ సినిమా టైటిల్‌గా ఎంచుకున్నందుకు దర్శకుడు శక్తివేల్‌కు ధన్యవాదాలని నిర్మాత సంఘమిత్ర సౌమ్య అన్నారు. డీజీ ఫిల్మ్ కంపెనీ, మాగ్నస్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం ప్రీరిలీజ్ ఈవెంట్ నగరంలో నిర్వహించారు. సీనియర్ దర్శకులు మిష్కిన్, అరుణరాజ కామరాజ్, తమిళరసరన్ పచ్చముత్తు, నటుడు అరుణ్ విశ్వ, పారి ఇళవళగన్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ శక్తివేల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని సంఘమిత్ర సౌమ్య అన్బుమణి నిర్మించారు. శక్తి ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై బి.శక్తివేల్ ఈ సినిమాను ఈ నెల 27న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. ఇదిలావుంటే, చిత్రం ప్రీరిలీజ్ ఈవెంట్‌లో నిర్మాత సౌమ్య మాట్లాడుతూ సినిమా షూటింగ్ సమయంలో చిన్న చిన్న సమస్యలు, మనస్పర్థలు తలెత్తినా వాటిని పక్కనబెట్టి సినిమా కోసం పనిచేయడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ నెల 27న విడుదల చేసున్న ఈ సినిమాను ప్రేక్షకులు థియేటర్ వెళ్ళి చూడాలని విజ్ఞప్తి చేశారు. దర్శకుడు శక్తివేల్ మాట్లాడుతూ, 'గుణనిధి హీరోగా నటించగా, ఇతర పాత్రల్లో పలువురు సీనియర్ నటీనటులు నటించారు. 'కాళి' అనే పాత్రలో ఓ శునకం నటించింది. మీడియా సపోర్టు చేసి హిట్ చేయాలని కోరుతున్నాం' అని పేర్కొన్నారు. హీరో గుణనిధి మాట్లాడుతూ, 'ఈ వేదికపై నుంచి నటుడిగా పరిచయం చేసిన దర్శక నిర్మాతలకు, మీడియాకు ప్రత్యేక ధన్యవాదాలు. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి నిర్మాత సంఘమిత్ర ఈ సినిమాను నిర్మించారు. సూపర్‌స్టార్ రజనీకాంత్ ఆశీస్సులు తీసుకుని ట్రైలర్ చూపించాం. సినిమా చూసి బాగుంది.. తప్పకుండా విజయం సాధిస్తుందన్నారు'. ఈ చిత్రంలో గుణనిధి, చెంబన్ వినోద్, కాళి వెంకట్, శ్రీరేఖ, కొట్రావి, రెజీనా రోస్, మాస్టర్ అజయ్ తదితరులు నటించగా, సంగీత అజేష్.



'అలంగు' ప్రీరిలీజ్ ఈవెంట్‌లో చిత్ర బృందం

ఎస్కేకు జోడీగా శ్రీలీల

శివకార్తికేయన్ (ఎస్కే) హీరోగా నటించే చిత్రంలో హీరోయిన్‌గా శ్రీలీలను ఎంపిక చేశారు.. సుధా కొంగర దర్శకత్వం వహించే ఈ సినిమాకు 'పురనానూరు' అనే పేరు పెట్టగా, శనివారం నుంచి షూటింగ్ ప్రారంభమైంది. శివకార్తికేయన్‌తో పాటు జయం రవి, అధర్వ కూడా నటిస్తున్నారు. 'అమరన్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత ఎస్కే.. దర్శకుడు ఏ.ఆర్.మురుగదాస్ సినిమాలో నటిస్తున్నారు. ప్రస్తుతం ఇది నిర్మాణ దశలో ఉంది. ఇపుడు సుధ కొంగర దర్శకత్వంలో 'పురనానూరు' మూవీలో నటించనున్నారు. ఇది ఎస్కే 25వ చిత్రం. డాన్ పిక్చర్స్ పతాకంపై ఆకాష్ భాస్కరన్ నిర్మిస్తున్నారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం. నిజానికి ఈ ప్రాజెక్టులో సూర్య, దుల్కర్ సల్మాన్, నస్రియా నటించాల్సి ఉంది. ప్రీప్రొడక్షన్ నిర్మాణ పనులన్నీ సుధ కొంగర - సూర్య పూర్తి చేశారు. కానీ, సూర్య బిజీ షెడ్యూల్ కారణంగా ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకోవడంతో ఎస్కే హీరోగా ఇపుడు తెరకెక్కిస్తున్నారు. సుధ కొంగర దర్శకత్వంలో సూర్య హీరోగా వచ్చిన 'సూరరై పోట్రు' మూవీ ఘన విజయం సాధించిన విషయం తెల్సిందే.



తన పాత్ర షూటింగ్ పూర్తి చేసిన అజిత్

చిత్రజ్యోతి

అజిత్ హీరోగా రూపొందుతున్న 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమాలో తన పాత్రకు సంబంధించిన షూటింగ్‌ను ఆయన పూర్తి చేశారు. ఈ చిత్రానికి అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. చిత్ర బృందం అజిత్ కుమార్ యంగ్ లుక్‌లో ఉన్న ఫొటో షేర్ చేసి వెల్లడించింది. దీనిపై దర్శకుడు అధిక్ ట్వీట్ చేస్తూ, 'జీవితకాలం అవకాశం ఇచ్చిన అజిత్‌కు రుణపడివుంటాను. నా కల నెరవేరింది. అజిత్‌తో చివరి రోజు షూటింగ్. ఇది ఒక అందమైన ప్రయాణం. లవ్ యూ అజిత్' అని పేర్కొన్నారు. కాగా, ఈ సందర్భంగా విడుదల చేసిన ఫొటోలో అజిత్ యంగ్ లుక్‌లో ఉన్నారనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. కాగా, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించే ఈ చిత్రంలో అజిత్ సరసన త్రిష, ప్రసన్న, సునీల్ తదితరులు నటించారు.



అధిక్ రవిచంద్రన్ - అజిత్ కుమార్

నేను చదువుకున్న స్కూల్‌పై సినిమా తీయండి : యోగిబాబు

తాను చదివిన పాఠశాలపై ఒక సినిమా తీయాలని కొన్నేళ్ళుగా ప్రయత్నం చేస్తున్నానని కానీ ఆ ప్రయత్నం కార్యరూపం దాల్చలేదని, అలాగే తను స్కూల్ లైఫ్ కూడా ఎవరైనా సినిమాగా తీయొచ్చని కమెడియన్, హీరో యోగిబాబు అన్నారు. క్వాంటమ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై ఆర్కే విద్యాధరన్ నిర్మించి, దర్శకత్వం వహించిన చిత్రం 'స్కూల్'. ఇళయరాజా సంగీతం అందించారు. ఇతర పాత్రల్లో భూమికా చావ్లా, యోగిబాబు, కేఎస్ రవికుమార్ ప్రధాన పాత్రలు పోషించగా, నిళల్‌గల్ రవి, బక్స్ శ్యామ్స్, ప్రియాంక వెంకటేష్ తదితరులు నటించారు. ఆడియో, ట్రైలర్‌ను శనివారం రాత్రి నగరంలో చిత్ర బృందం విడుదల చేసింది. దర్శకనిర్మాత ఆర్కే విద్యాధరన్ మాట్లాడుతూ, 'కళాకారుడికి పూర్తి స్వేచ్ఛాస్వాతంత్ర్యం లభిస్తే, అతనిలో సరికొత్త ఆలోచనలు వస్తాయి. ఆ ఉద్దేశంతోనే క్వాంటమ్ ప్రొడక్షన్ స్థాపించాను. ఈ కథలో ఎవరిని నటుడిగా ఎంపికచేయాలని ఆలోచన చేస్తుండగా ప్రతి ఒక్కరూ యోగిబాబు పేరు చెప్పారు. ఈ సినిమాలో యోగిబాబు, భూమికా చావ్లా ఉపాధ్యాయులుగా నటించారు. నా గురువు కేఎస్ రవికుమార్ మరో కీలక పాత్ర పోషించారు. నటుడు యోగిబాబు మాట్లాడుతూ, 'నేను చదువుకున్నది ప్రభుత్వ పాఠశాల. ఈ స్కూల్ కథను ఒక సినిమాగా తీయాలని కొన్నేళ్ళుగా ప్రయత్నం చేస్తున్నాం. కానీ, అది కార్యరూపం దాల్చలేదు. నా స్కూల్ జీవితాన్ని కూడా సినిమా తీయాలని కోరుతున్నా. ఈ సినిమాకు ఇళయరాజా అద్భుతమైన సంగీత స్వరాలు సమకూర్చారు. సినిమా బాగా వచ్చింది. ప్రతి ఒక్కరూ చూసి ఆదరించాలి' అని కోరారు.



'స్కూల్' ఆడియో రిలీజ్ వేడుక

కనులపండువగా తాడికొంబు ఆలయ లక్షార్చన



భక్తులు వెలిగించిన లక్ష దీపాలు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా తాడికొంబులోని సౌందరరాజ పెరుమాళ్ ఆలయం ప్రసిద్ధిచెందింది. ఈ ఆలయ వేడుకల్లో పరిసర జిల్లాలకు చెందిన ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొంటారు. కార్తీక ఉత్సవాల సందర్భంగా శనివారం ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకం, దీపారాధన నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తి సన్నిధి నుంచి దీపం తీసుకొచ్చి, ఆలయం, పరిసర ప్రాంతాల్లో పెట్టిన లక్ష దీపాలు వెలిగించారు. దీపాలు, బాణాసంచా వెలుగుల మధ్య ఆ ప్రాంతం సరికొత్త శోభను సంతరించుకుంది.

వెల్లివిరిసిన 'మతసామరస్యం'

- దర్గాలో కార్తీక దీపాలు వెలిగించి పూజలు



దర్గా, ప్రాంగణంలో ఉంచిన కార్తీక దీపాలు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మతసామరస్యాన్ని చాటేలా సేవూరు సమీపం కానూరు మహమ్మద్ షా వలివుల్లా దర్గాలో కార్తీక దీప పూజలు నిర్వహించారు. తిరుప్పూర్ జిల్లా కానూరులో దఖ్నీ సున్నత్ జమాత్ మసీదు, మహమ్మద్ షా వలివుల్లా దర్గాలున్నాయి. వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో ఉన్న ఈ దర్గాలో ప్రతి ఏడాది ఉరుసు ఉత్సవం కోలాహలంగా నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో, కార్తీక దీపోత్సవం సందర్భంగా గత శుక్రవారం రాత్రి ఆలయం, ప్రాంగణంలో ఆ ప్రాంత ప్రజలు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఈ విషయమై దర్గా హజరత్ శంసుద్దీన్ మాట్లాడుతూ... వృత్తి పరమైన అభివృద్ధి, వివాహం, సంతానం వంటి కోర్కెలు నెరవేరుతుండడంతో, కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల ప్రజలు దర్గాకు వస్తుంటారన్నారు. అలాగే, కార్తీక దీపోత్సవం సందర్భంగా ఈ ప్రాంత ప్రజలు ఇక్కడకు వచ్చి కార్తీక దీపాలు వెలిగిస్తుంటారు. ఈ దర్గా మత సామరస్యానికి ప్రతీకగ ఉందని ఆయన తెలిపారు.

కరుప్పరాయన్ ఆలయంలో పశ్చిమ బెంగాల్ గవర్నర్



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న ఆలయ నిర్వాహకులు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్ గవర్నర్ ఆనంద్ బోస్ కోవై జిల్లాలోని ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పెరియనాయకన్‌పాళయం సమీపం ఒన్నిపాళయంలో ఎల్లై కరుప్పరాయన్ ఆలయం ఉంది. ఈ ఆలయంలో ప్రతి నెలా పౌర్ణమి రోజున విశేష పూజలు నిర్వహిస్తుంటారు. ఆ ప్రకారం, శనివారం జరిగిన పూజలకు పశ్చిమ బెంగాల్ గవర్నర్ ఆనంద్ బోస్ కుటుంబ సమేతంగా హాజరయ్యారు. పూజల్లో పాల్గొన్న గవర్నర్, మధ్యాహ్నం భోజనం అనంతరం కోవై సర్క్యూట్ హౌస్‌కు బయల్దేరి వెళ్లారు. గవర్నర్ పర్యటనను పురస్కరించుకొని ఆలయం, పరిసర ప్రాంతాల్లో పోలీసులు భద్రతా విధులు చేపట్టారు.

శ్రీవిల్లిపుత్తూర్‌లో ఓపీఎస్ ప్రత్యేక పూజలు



ఆండాళ్ ఆలయంలో పన్నీర్‌సెల్వం

పెరంబూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీవిల్లిపుత్తూర్ ఆలయంలో మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. నగరంలో ఆదివారం అన్నాడీఎంకే సర్వసభ్య సమావేశం ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలో జరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో, అన్నాడీఎంకే హక్కుల పరిరక్షణ కమిటీ పేరుతో సమావేశాలు నిర్వహిస్తున్న ఓపీఎస్, శ్రీవిల్లిపుత్తూర్ ఆండాళ్ ఆలయంలో ఆదివారం జరిగిన పౌర్ణమి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం శ్రీ విల్లిపుత్తూర్ పశ్చిమ కనుమల కొండ దిగువన ఉన్న కులదేవత చెంబగతోపు వనపేచ్చి అమ్మవారికి ఆలయానికి కుటుంబ సమేతంగా వెళ్లిన ఓపీఎస్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అన్నాడీఎంకే సర్వసభ్య సమావేశం గురించి విలేఖరులు ప్రశ్నించగా, 'ఆలయానికి వచ్చిన ప్రాంతంలో రాజకీయాలు మాట్లాడరాదు' అంటూ ఓపీఎస్ వెళ్లారు.

నేటినుంచి తిరుప్పావై ప్రచారోద్యమం

- శ్రీవిల్లిపుత్తూరు శఠగోప రామానుజ జీయర్ ప్రకటన

టి.నగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసంలో వ్రతమాచరిస్తూ ఆండాళ్‌దేవి గానం చేసిన పాశురాల సమాహారం 'తిరుప్పావై'ని లక్షమందికి నేర్పించే సంకల్పంతో వడకరై నుండి వడ (నార్త్) అమెరికా వరకు తిరుప్పావైపై ప్రచారోద్యమాన్ని మార్గళి ఒకటి నుండి ప్రారంభించనున్నట్లు శ్రీవిల్లిపుత్తూరు శఠగోప రామానుజ జీయర్ ప్రకటించారు. శ్రీవిల్లిపుత్తూరు మనవాళమామునుల మఠంలో శఠగోపన్ రామానుజ జీయర్ మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ వద్ద 216 అడుగులు ఎత్తైన భగవద్ శ్రీరామానుజుల విగ్రహాన్ని ప్రతిష్ఠించిన త్రిదిండి చిన్న శ్రీమన్ నారాయణ రామానుజ జీయర్ స్వామి మార్గళి మొదటిరోజు (ఈనెల 16న) ఆండాళ్ తాయార్‌ను దర్శించి మంగళాశాసనం చేయనున్నారని తెలిపారు. ఆ రోజు ఉదయం శ్రీవిల్లిపుత్తూరు శఠగోప రామానుజ జీయర్ మఠంలో తిరువారాధన, తీర్థ గోష్ఠి నిర్వహించనున్నామని తెలిపారు. అమెరికాలోని సుదర్శన సేవా సమితి ఆధ్వర్యంలో లక్షమందికి తిరుప్పావై పాశురాలను నేర్పించడానికి వడకరై నుండి వడ అమెరికా వరకు 40 రోజులపాటు తిరుప్పావై ప్రచారోద్యమం రాజపాళయంలోని వడకరై ప్రాంతం నుండి ఈనెల 16 ఉదయం ప్రారంభమవుతుందని తెలిపారు.



శఠగోప రామానుజ జీయర్



మురుగన్ ఆలయం వద్ద భక్తుల రద్దీ

తిరుత్తణి ఆలయంలో భక్తుల రద్దీ



ట్రాఫిక్ రద్దీలో చిక్కుకున్న వాహనాలు

తిరుత్తణి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. రాష్ట్రం నుంచే కాక ఆంధ్ర, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారి దర్శనానికి భక్తులు సుమారు రెండు గంటలు క్యూలైన్లలో వేచి ఉన్నారు. కాగా, పర్యాటకులు వచ్చిన వాహనాలతో నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ ప్రాంతానికి చెందిన పోలీసులు తిరువణ్ణామలై కార్తీక దీపోత్సవాల భద్రతకు వెళ్లడంతో, ట్రాఫిక్ క్రమబద్ధీకరించే వారు లేకపోవడంతో వాహనాలు రోడ్లపై బారులుతీరాయి.

కావేరి హాస్పిటల్‌లో మధుమేహ చికిత్సా కేంద్రం

చెన్నై, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆళ్వార్‌పేటలోని కావేరి హాస్పిటల్‌లో మధుమేహ బాధితుల కోసం ప్రత్యేక చికిత్సా కేంద్రం ఏర్పాటైంది. ఈ చికిత్సా కేంద్రాన్ని రాష్ట్ర ప్రజా పంపిణీ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ జే రాధాకృష్ణన్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కావేరి ఆస్పత్రుల గ్రూపు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అరవిందన్ సెల్వరాజ్ మాట్లాడుతూ మధుమేహ చికిత్సా కేంద్రంలో నెఫ్రాలజీ, కార్డియాలజీ, వాస్కులర్ సర్జరీ, ఫుట్ కేర్, డైటీషియన్ తదితర కీలకమైన విభాగాల వైద్యనిపుణులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సీనియర్ డయబెటాలజిస్ట్ డాక్టర్ భరణీధరన్ తదితరులు పాల్గొన్నారు.



మధుమేహ చికిత్సా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర ప్రజా పంపిణీ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ జే రాధాకృష్ణన్

కన్నియాకుమారిలో 'అల'జడి

- భీతిల్లిన పర్యాటకులు



తిరువళ్లువర్ విగ్రహం ప్రాంతం వద్ద ఎగసిపడుతున్న అలలు

చెన్నై, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ పర్యాటక ప్రాంతం కన్నియాకుమారి తీరంలో ఆదివారం వేకువజాము నుంచి పెనుగాలులు వీయడంతో అలలు తీరం వైపు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. సూర్యోదయాన్ని వీక్షించే త్రివేణి సంగమ ప్రాంతం వద్ద కూడా తీరంలో అలలు ఎగసిపడటంతో పర్యాటకులు స్నానం చేసేందుకు సైతం భయపడ్డారు. అలల ఉధృతిని గమనించి పోలీసులు కాపలాగా నిలిచి పర్యాటకులను తీరం వైపు వెళ్ళకుండా కట్టుదిట్టం చేశారు. అలల తాకిడి అధికంగా ఉండటంతో వివేకానంద స్మారక మండపానికి బోట్ సవారీ రద్దు చేశారు. తిరువళ్లువర్ విగ్రహ ప్రాంతం వద్ద కూడా అలలు ఎగసిపడ్డాయి. చిన్నముట్టం, వావుత్తురై, కోవళం, కీళ్‌మణక్కుడి, మణక్కుడి వంటి తీర ప్రాంతాల్లోనూ అలల ఉధృతి అధికమైంది. పౌర్ణమి సందర్భంగా సముద్రంలో ఆటుపోట్లు అధికంగా ఉంటాయని, వీటికి తోడు బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడంతో దాని ప్రభావం వల్ల పెనుగాలులు వీచి అలలు 20 అడుగుల ఎత్తు వరకు తీరం వైపు ఎగసిపడుతున్నాయని స్థానికులు తెలిపారు.

డీపీఐకి ఆదవ్ అర్జున గుడ్‌బై



చెన్నై, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఓ తమిళ వారపత్రిక నిర్వహించిన అంబేడ్కర్ పుస్తకావిష్కరణ సభలో టీవీకే నేత విజయ్‌తోపాటు పాల్గొని డీఎంకే కూటమికి చేటు కలిగించేలా విమర్శలు చేసిన డీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి ఆదవ్ అర్జున పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆదివారం పార్టీ నేత తిరుమావళవన్‌కు రాజీనామా లేఖను పంపారు. అంబేడ్కర్ పుస్తకావిష్కరణ సభలో పార్టీ నియమనిబంధనలు ఉల్లఘించి విమర్శలు చేసినందుకుగాను ఆయనను ఆరుమాసాలపాటు పార్టీ నుండి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. సస్పెండ్ అయిన తర్వాత ఆదవ్ అర్జునా ప్రసారమాధ్యమాల్లో ఇంటర్వ్యూలు ఇస్తూ డీపీఐ, డీఎంకేపై దుమెత్తిపోశారు.

ఒకేరోజు 12 అడుగులు పెరిగిన నెల్లై కారైయార్



నెల్లై కారైయార్ జలాశయం

పెరంబూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి కారైయార్ జలాశయం నీటి మట్టం ఒకేరోజు 12 అడుగులకు పెరిగింది. తిరునల్వేలి జిల్లాలోని పశ్చిమ కనుమల్లో మూడు రోజులుగా భారీవర్షాలు కురుస్తుండడంతో జిల్లాలోని జలాశయాలకు నీటి రాక అధికమైంది. ఆ ప్రకారం, 143 అడుగుల పూర్తి సామర్థ్యం కలిగిన కారైయార్ జలాశయం నీటిమట్టం ఆదివారం ఉదయం గణాంకాల ప్రకారం ఒకేరోజు సుమారు 12 అడుగులు పెరిగి 96.9 అడుగులకు చేరింది. ఇక, 118 అడుగుల సామర్థ్యం కలిగిన మణిముత్తారు జలాశయ నీటిమట్టం 96.84 అడుగులకు చేరుకుంది. మరో రెండు రోజులు నీటి రాక ఇలాగే కొనసాగితే రెండు జలాశయాల్లో నీటిమట్టాలు 100 అడుగులకు చేరుకొనే అవకాశముందని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

మార్గబంధీశ్వరాలయంలో భక్తుల రద్దీ



తడిబట్టలతో ఆలయంలో నిద్రిస్తున్న భక్తులు

వేలూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విరించిపురంలో ప్రసిద్ధిచెందిన మార్గబంధీశ్వరాలయంలో కార్తీక మాసం ఆఖరి ఆదివారం సందర్భంగా ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. ఆలయంలో ఉన్న సింహకొలనును ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు తెరిచారు. మహిళలు సింహకొలనులో పుణ్యస్నానాలు చేసి, ఆలయ ప్రాంగణంలో తడి బట్టలతో, చేతిలో నిమ్మపండు, తమలపాకు, వక్క ఉంచుకొని నిద్రించారు. ఈ విధంగా చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. సంతానం లేని మహిళలు, వివాహం కాని యువతులు ఈ విధంగా నిద్రించారు. ఈ వేడుకల్లో రాష్ట్రంతో పాటు ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కలవై సచ్చిదానంద స్వామి, రత్నగిరి బాలమురుగన్ అడిమై స్వామి, అనైకట్టు ఎమ్మెల్యే నందకుమార్, జిల్లా పంచాయతి అధ్యక్షుడు బాబు సహా పలువురు పాల్గొన్నారు.

వైభవంగా దత్తాత్రేయ జయంతి



దత్తాత్రేయ అష్టోత్తర పూజలు చేస్తున్న నిర్వాహకులు

ప్యారీస్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడ్‌వే ఆచారప్ప వీధిలో జై వాసవి సాయి చారిటబుల్ ట్రస్ట్ నిర్వహణలోని అక్షయ సాయి బాబా మందిరంలో దత్తాత్రేయ జయంతిని ఆదివారం వైభవంగా జరుపుకున్నారు. త్రిమూర్తుల అంశంతో అవతరించిన దత్తాత్రేయుడికి ఆవు నెయ్యి, పత్రాలు, పండ్లు, సుగంధద్రవ్యాలు, పాయసం నివేదించారు. అనంతరం స్వామి వారికి అష్టోత్తరాలు, కనకధార స్తోత్రం పఠించి గురు పూజ చేశారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ అజంతా డా.కనిగెలుపుల శంకరరావు, కేంద్ర ప్రభుత్వ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాది స్వర్ణలత భక్తులకు తీర్థ అన్న ప్రసాదాలు, ముత్తుదువులకు పసుపు కుంకుమ పంపిణీ చేశారు.

ఘనంగా ఎస్ఐబీజీఏ గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు



అతిథులు, సీనియర్ ప్లాస్టర్లతో రెవ.అద్దంకి ఐసయ్య తదితరులు

ప్యారీస్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సౌత్ ఇండియా బాప్టిస్ట్ జనరల్ అసోసియేషన్ (ఎస్ఐబీజీఏ) ఆధ్వర్యంలో పురుషవాక్కంలోని స్కిడ్ మోర్ హాలులో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఎస్ఐబీజీఏ తమిళనాడు కో-ఆర్డినేటర్ రెవ.అద్దంకి ఐసయ్య సారథ్యం వహించగా, సంస్థ అధ్యక్షుడు రెవ.ఆశీష్ మాథ్యూ, రెవ.కేపీ రాజశేఖర్, రెవ.డా.జి.వినయ్‌కుమార్ తదితరులు క్రీస్తు జనన విశేషాలపై ప్రసంగించారు. జిల్లా కో-ఆర్డినేటర్లు రెవ.కె.అంతోని, రెవ.కె.ఐసయ్య, రెవ.తాటిపర్తి ఐజక్, సీనియర్ బోధకులు ఎం.ఆదాము, పి.రమేష్, సాల్మన్, డా.వరప్రైజ్ మురళి తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



హొగేనకల్ జలపాతం వద్ద ఇన్‌ఫ్లో తగ్గటంతో ఆదివారం దోనెలపై షికార్లు చేస్తున్న పర్యాటకులు